క్లుప్తంగా

ప్రతిభా అవార్డులకు ఎంపిక

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ వసంతకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ విభాగం నుంచి 571 మార్కులు సాధించిన మనుబోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తాంబరపు లక్ష్మీసాహితి, 553 మార్కులు సాధించిన నాగవైష్ణవి, ఎస్టీ విభాగం నుంచి 570 మార్కులు సాధించిన కంటేపల్లి మౌనిక, బీసీ–ఏ విభాగంలో 548 మార్కులు సాధించిన చల్లా లిఖిత్‌కృష్ణ, బీసీ–ఈ విభాగంలో 558 మార్కులు సాధించిన మడమనూరు హైస్కూల్ విద్యార్థిని షేక్ నేహా తదితరులను ఎంపిక చేసినట్లు వివరించారు. వీరికి రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

లీగల్ సేవలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న న్యాయవాది శ్యామాచార్యులు

కోవూరు: పాటూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో ప్రతి శనివారం లీగల్ సెల్‌కు సంబంధించిన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సలహాలు సూచనలు కావాలంటే సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకుడు శ్యామాచార్యులు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటి అనేక పథకాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రజలకు కూటమి ప్రభుత్వం మీద ఉన్న ఆశలు ఆడియాశలు అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం లీగల్ సెల్ నేతలు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం ఇష్టానుసారం చార్జీలు పెంచడం వల్ల పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయన్నారు. వైస్ ఎంపీపీ, పార్టీ పట్టణ కన్వీనర్ నరసింహులురెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు బాలకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

పొదలకూరు : ఏపీ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు స్టేట్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ ఎంపీసీ విద్యార్థిని దేవళ్ల నిత్యకృతిక 470 మార్కులకు 467 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలువగా, ఎస్‌కే తస్లిమా 466 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఇదే గ్రూపులో సాయికీర్తి, హేమంత్, లిఖిత 464 మార్కులు కైవసం చేసుకున్నారు. త్రివేణి 462, సాయిరోహిత్, మేఘన 460 మార్కులు సాధించారు. సీఈసీలో నందిని 469 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శనివారం అభినందించారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ ఎ.సుబ్బారావు, జి.నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ కృష్ణ, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో మేలు

తోటపల్లిగూడూరు: జీవన ఎరువులతో భూమికి ఎంతో మేలు అని, రైతులు వీటి వాడకాన్ని పెంపొందించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని కోడూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి దుక్కులు వాటి ఆవశ్యకత గురించి వివరించారు. విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచించారు. ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలన్నారు. సమావేశంలో ఏఓ శిరీషారాణి, బ్యాంకింగ్ కో–ఆర్డినేటర్ రవిశంకర్, వీఏఏలు వినీల్‌శివకుమార్, విద్యాసాగర్, నిరీష, దయానా, అనూషా, ఝాన్సీ, వైష్ణవి, ఏఈఓ ప్రసన్న పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ముత్తుకూరు(పొదలకూరు) : రసాయన ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించాలని, లేకుంటే భూమి సారవంతాన్ని కోల్పోతుందని ఐఏఆర్ఆర్ కేంద్ర విభాగం శాస్త్రవేత్త నాగేశ్వరరావు అన్నారు. ముత్తుకూరు మండలంలోని పంటపాళెం రైతు సేవా కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమి సారవంతాన్ని తెలుసుకోవాలని సూచించారు. కేవీకే నెల్లూరు మత్స్య శాస్త్రవేత్త మరిసాధు సమగ్ర చేపల పెంపకం గురించి వివరించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్




ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సందేశమిస్తున్న సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి



నెల్లూరు(బృందావనం): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకొన్నారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. బారాషహీద్ దర్గా, సంతపేట, నవాబుపేట నజీర్‌తోట తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద మత పెద్దలు ధార్మిక ఉపన్యాసాలిచ్చారు.

ఇస్లాం సర్వమానవాళికి మార్గదర్శకం

శాంతిని బోధించి, హింసను వ్యతిరేకించే ఇస్లాం సర్వమానవాళికి మార్గదర్శకమని బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద సందేశమిచ్చారు.

కానరాని ప్రజాప్రతినిధులు

ఈ ఏడాది నిర్వహించిన బక్రీద్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాకపోవడం గమనార్హం.

• చిన్నబజార్‌లోని పెద్ద దర్గా మసీద్ షెహన్ షా ఖ్వాజాపీర్‌లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. బాబాసాహెబ్ బంద్ నవాజ్ ఆధ్వర్యంలో దువా చేశారు.


పెద్ద దర్గాలో..

ఆభరణాల మాయంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): సూట్‌కేస్‌లోని నగలబాక్సులో ఉంచిన డైమండ్, బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. కర్నూలుకు చెందిన కృష్ణమూర్తి, వీరనారాయణమ్మ దంపతులు తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకుగానూ పొదలకూరుకు గత నెల 15న వచ్చారు. అనంతరం తల్లి వద్దకెళ్లారు. తన 150 గ్రాముల డైమండ్, బంగారు ఆభరణాలను బాక్సులో ఉంచి సూట్‌కేస్‌లో అదే నెల 19న ఆమె పెట్టుకున్నారు. కర్నూలు వెళ్లేందుకు గానూ పొదలకూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూరు చేరుకున్నారు. అనంతరం కర్నూలు బస్సెకి, సూట్‌కేసును అందులో ఉంచి వాష్‌రూమ్‌కు వెళ్లారు. మరుసటి రోజు కర్నూలులో బస్సు దిగి ఇంటికెళ్లి, కొద్దిసేపటి అనంతరం సూట్‌కేస్‌లోని బాక్సును తెరవగా, అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు విషయాన్ని అదే రోజు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో హాస్పిటల్లో చికిత్స పొంది నెల్లూరుకు శనివారం వచ్చారు. తాను వాష్‌రూమ్‌కు వెళ్లొచ్చేసరికి, తన సీటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఉన్నారని, చోరీకి ఆయనే పాల్పడి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాయికుమార్‌రెడ్డికి నివాళులు



నెల్లూరు(బృందావనం): సామాజికవేత్త బత్తిన సాయికుమార్‌రెడ్డి సంతాప సభను పురమందిరంలో శనివారం నిర్వహించారు. ఆయన మరణం సింహపురి సమాజానికి తీరనిలోటని పలువురు పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మదన్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, కాకు మురళీరెడ్డి, ఉడతా శ్రీనివాస్‌యాదవ్, జెనెక్స్ అధినేత వెంగళరెడ్డి, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ రాధిక, విజయభాస్కర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం సంఘ ప్రధాన కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్ మాట్లాడారు. శిక్షణను ఈ నెల 21 వరకు నిర్వహించనున్నామని వివరించారు. శిక్షకులు కంచి ఆనంద్ రెడ్డి, భార్గవకృష్ణ, చంద్రశేఖర్, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాచరణ ప్రణాళికపై సమావేశం


మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): స్వర్ణాంధ్ర – 2047 నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాచరణ బృందంతో సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నందన్ మాట్లాడారు. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసే అంశమై చర్చించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్‌రావు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ,డిప్యూటీ డైరెక్టర్ మాధురి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు నేడు

నెల్లూరు(క్రైమ్): రామలింగాపురంలోని ఫ్లైఓవర్ వద్ద ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించామని నగర డీఎస్పీ సింధుప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట లేఅవుట్ వైపు నుంచి వచ్చే వాహనాలను రామలింగాపురం ఫ్లైఓవర్ మీదుగా ఆత్మకూరు బస్టాండ్‌కు.. శ్రీహరినగర్, ముత్యాలపాళెం మీదుగా నగరంలోకి.. వీఆర్సీ నుంచి ముత్తుకూరు, ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలను ఎం – 1 థియేటర్ మీదుగా మళ్లించారు. ముత్తుకూరు వైపు వెళ్లే వాహనాలను బాలాజీనగర్, చిల్డ్రన్స్‌పార్కు మీదుగా దారి మళ్లించామని వివరించారు. ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇది అమల్లో ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యక్తిపై ఇద్దరి దాడి

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు నిందితులపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్ట మున్సిపల్ వీధిలో నివాసం ఉంటున్న వెంకటేష్‌కు అదే ప్రాంతానికి చెందిన నానీ అలియాస్ చందుతో పాత గొడవలున్నాయి. ఈ క్రమంలో టీ తాగేందుకు వెంకటేష్ శుక్రవారం వెళ్తుండగా, నానీ అతని స్నేహితుడు శివ అడ్డుకొని దాడి చేశారు. గాయపడిన బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులకు అత్యాధునిక చికిత్స

నెల్లూరు రూరల్: హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులకు నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో అత్యాధునిక వ్యవస్థ అందుబాటులో ఉందని హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ సీతాలక్ష్మి, గైనకాలజిస్ట్ మంజూష తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

ఘన సన్మానం

నెల్లూరు రూరల్: నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో రక్తదాన మోటివేటర్ అరిగెల సాయిరామ్‌ను శనివారం సత్కరించారు. సైకిల్ యాత్రను చేపట్టిన క్రమంలో ఆయనను రెడ్‌క్రాస్‌లో కన్వీనర్ అజయ్‌బాబు, అడ్వైజర్ మలిరెడ్డి కోటారెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డు విస్తరణ దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీ కాలనీ, సారాయంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమినగర్, ప్రగతినగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

బెయిల్‌పై విడుదల

నెల్లూరు(క్రైమ్): రుస్తుం మైన్స్ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న కరుణాకర్‌రెడ్డి, శివారెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం విడుదలయ్యారు.

చాముండేశ్వరికి అశ్వవాహన సేవ



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. పుష్పాలంకరణతో శోభాయమానంగా వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారిని భక్తులు దర్శించి తన్మయం చెందారు. ఉభయకర్తలుగా స్థానిక వైశ్య సంఘీయులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం జరిగింది. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవం సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

మిత్రకు వీడ్కోలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చెస్ ఎడ్యుకేషన్ సెక్రటరీగా రాష్ట్రంలో విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన వైటీ మిత్రకు ఘనంగా వీడ్కోలు పలికారు. వీఆర్సీ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్లో ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డాక్టర్ డేవిడ్‌లివింగ్‌స్టన్ అధ్యక్షతన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డానీహాల్ తెలుగు సర్వీస్ పాస్టర్ రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్, బట్వాడిపాళెం సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ హరిపాల్, డాక్టర్ నిర్మల్‌కుమార్, డాక్టర్ మణిరావు, ఇంగ్లిష్ సర్వీసెస్ అసోసియేట్ చాప్లిన్ డాక్టర్ రాజకుమారి జయకుమార్, సెక్రటరీ శరత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ కస్టమ్స్ ఉషాకిరణ్, క్వైర్ డైరెక్టర్ ప్రవీణ, తెలుగు సర్వీస్ ఎవాంజలికల్ డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చేతికి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. బట్టేపాటి నరేంద్రరెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, పిడుగు మధు, బిరదవోలు రూప్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ పామంజి శ్రీనివాసులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

• 53వ డివిజన్ వాటర్ ట్యాంక్ వీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నేత బ్రహ్మారెడ్డిని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, వెంగళరెడ్డి, మహేష్‌యాదవ్, నేతలు బాలిరెడ్డి, నిర్మలమ్మ, ప్రసన్న, ప్రసాద్, సలామ్, అసోలేమ్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

• పడుగుపాడులో పార్టీ నేత మస్తాన్‌ను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. మస్తాన్ తల్లి బీబీజాన్ ఇటీవల మరణించడంతో వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శరత్‌కుమార్, ఖాజాబాబా, మోహిత్, శింగంశెట్టి అశోక్, బాలకృష్ణారెడ్డి, పెంచలయ్య, సుమధుర్, ఉదయ్, మీరా తదితరులు పాల్గొన్నారు.

నేటి యోగా కార్యక్రమాల్లో పాల్గొనండి

• ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొవాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ కోరారు. యోగాంధ్రలో భాగంగా ఆదివారం ఉదయం నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, రామచంద్ర మిషన్ ప్రాంతాల్లో సీనియర్ సిటిజన్స్ కోసం యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాకర్స్ క్లబ్స్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, పెన్షనర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ధ్యానం, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు వంటి యోగా కార్యక్రమాలు చేయించాలని యోగా ట్రైనర్లకు సూచించారు. 9వ తేదీ ఉదయం యోగాంధ్ర బ్యానర్‌తో ప్రతి గ్రామం, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో యోగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. జిల్లా పరిషత్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని జెడ్పీ సీఈఓకు సూచించారు. 10వ తేదీ పర్యాటక ప్రదేశం ఉదయగిరిలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆ ప్రాంత ప్రజలు ఎక్కువగా భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారికి సూచించారు. జిల్లా అధికారులు కూడా ఉదయగిరిలో జరిగే యోగాంధ్రలో పాల్గొనాలన్నారు.

తాగునీరు అందించాలని మహిళల ఆందోళన


మాట్లాడుతున్న గిరిజన మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామ పంచాయతీ గిరిజన కాలనీల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు గత నాలుగు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని పలువురు మహిళలు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా తమ సమస్యను పంచాయతీ సిబ్బంది, స్థానిక సర్పంచ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పక్కనే పెన్నానది ఉన్నా తాగునీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.